

# ముగింపు లేని కథ

ఎస్. ఛాయాదేవి

అన్నయ్య చెప్పిన కథ:—

కొత్త కథ రాయటానికి కూర్చున్నాను.

ఇంతలో వాకిలి తలుపు చప్పుడయింది. ఈవేళప్పుడు వచ్చింది ఎవరను కొంటూ వెళ్ళి తలుపు తీశాను.

అన్నయ్య!

తలుపుతీయగానే సుడిగాలిలా లోపలికి దూసుకువచ్చాడు. ఎండకి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది.

''ఇదేవిటి—ఈవేళప్పుడు వచ్చావే. మంచినీళ్ళ 'వనా?'' అన్నాను వెనక్కి తిరుగుతూ.

''ఏం అక్ఖర్లేదుకాని, నువ్వు కథలు రాస్తావా నిజంచెప్పు చెల్లమ్మా'' అన్నాడు రుమాలుతో చెమట తుడుచుకొంటూ.

అంత హఠాత్తుగా దాంతో ఏం అవసరమొచ్చిందో. అసలా విషయం ఎవరు చెప్పారో నా కర్థం కాలేదు.

''అది అడిగేందుకా యింత ఎండలో పడొచ్చావ్'' అన్నాను.

''అయితే అయింది కాని, నువ్వు నిజంగా కథలు రాస్తావా చెప్పు'' అన్నాడు.

''ఇప్పుడదే చెయ్యబోతున్నాను'' అన్నాను. అన్నయ్య ముఖం ఒక్కసారి వెలిగింది.

''అయితే కూర్చో చెల్లమ్మా. నీకో విషయం చెప్పాలి'' అన్నాడు తనొక కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

చెప్పమన్నట్లు అన్నయ్య ముఖంలోకి చూస్తూ, నేనూ టేబిల్ముందర కుర్చీ లాక్కుని కూర్చున్నాను.

''ఇది నాకథే చెల్లమ్మా. నువ్వు తప్పకుండా రాయాలి. రాస్తావుకదూ!'' అని ప్రాధేయపడుతున్నట్లు చూశాడు. అలాగే అన్నట్లు బుర్ర వూపాను.

"మొదట్లో—అంటే బిజినెస్ ప్రారంభించకపూర్వం నేనేం చేసేవాడినను

కొంటున్నావ్?'' అని అడిగాడు కుతూహలంగా.

"బహుశ ఎవరిదగ్గరనైనా అసిస్టెంట్‌గా వుండివుంటావ్'' అన్నాను పెద్దగా నవ్వాడు.

'కూలిచేసుకు బతికేవాడివి" అన్నాడు

షాక్ తిన్నట్లు అయ్యాను. ఊళ్లో అందరికంటె ధనవంతుడు అన్నయ్యే యిప్పుడు

''మరి బిజినెస్ ఎలా మొదలుపెట్టావనుకొంటున్నావో'' అని అడిగాడు లేచి ఫాన్ ఆన్‌చేస్తూ.

చిరునవ్వుతో బుజ్జ అడ్డంగావూపాను తెలీదన్నట్లు.

''సౌభాగ్యంతో. అది రావటంతోనే నా బిజినెస్ మొదలయింది.''

"కట్నమిచ్చుంటారు"

మళ్ళీ నవ్వాడు అన్నయ్య. కూలి చేసుకొనేవాడికి కట్నమెవరిస్తారు చెల్లమ్మా! పిల్లనిస్తేచాలు. అదీ జరగలేదు" అన్నాడు.

"వాళ్లు చెయ్యకపోతే సౌభాగ్యమే వచ్చేసివుంటుంది" అన్నాను.

''అంటే నన్ను ప్రేమించిందంటావా?"

''కాక. నాల్గురోజులు వుండిపోదామని వస్తుందా?'' నవ్వుతూ అన్నాను.

''అదంతా సరేగాని, సౌభాగ్యం నన్ను ద్వేషించినంత ఈ ప్రపంచంలో ఎవర్నీ ద్వేషించదు" అన్నాడు టేబిల్ మీదకు వంగి కుతూహలంగా నా ముఖంలోకి చూస్తూ.

''అందుకనేకదూ, 'సౌభాగ్యం నా జీవనభాగ్యం' అని రోజుకి పదిసార్లన్నా అనుకొంటావు'' అన్నాను నవ్వుతూ.

నవ్వాడు "ఇదిగో చెల్లాయి. నీకు జీవితానుభవం తక్కువ. నేచెబుతా విను. ఈ ప్రపంచంలో తనకోసం లోకంకోసం అని రెండురకాల బతుకులు బతికేవాళ్ళే ఎక్కువ. రెండూ ఒక్కటిగా బతికే వాళ్ళని చేతకాని వాళ్ళకిందే పరిగణిస్తారు. ఇంతకీ నే చెప్పింది తెలిసిందా చెలమ్మా! అలా రెండురకాల బతుకులు బతికేవాళ్ళ జాబితాలో మొదట మమ్మల్ని జేర్చు"


''నా కర్థం కావటంలేదు'' అన్నాను.

''అర్థమయ్యేట్లు చెబుతావిను. సౌభాగ్యమే కనుక నన్ను హీనంగా చూడకుండా వుండినట్లయితే, ఈ నాడు యిలా ఉండేవాడ్ని కాదేమో" సాలోచనగా అగాడు.

''హీనంగానా? ఎందుకని?''

''ఆవిడ రోజూ ఆ దోవంబడి వెళ్ళేది. చూస్తూనేవుండేవాడ్ని. ఒకరోజు—సరదాగా ఆవిడ దోవకి అడ్డం పెడితే ఏం చేస్తుందో చూద్దామనిపించి, వెళ్ళాను. ఆవిడ సౌందర్యాన్ని చూసి మతిపోగొట్టుకొన్నానని చెప్పటకొచ్చినట్లు వాగింది, తన అంతస్థుకి నా అంతస్థుకి వేలెత్తిచూపుతూ హీనపరిచింది. సహించలేకపోయాను. కష్టపడి బతికేవాడు చేసేది ఎలాంటి కష్ట

యువ




మైనా. గౌరవనీయుడే! ఆ భావం చిన్నప్పుడే నాలో మానాన్న కలిగించాడు. అందు నే సౌభాగ్యం కాటలు సహించలేక పోయాను. విర్రవీగినందుకు ఫలితం అనుభవించింది. కొన్నాళ్లకు తల్లిని కాబోతున్నా నంటూ వచ్చి పాదేయబడ్డది. కపిపీగా అనుభవించాను. నాకు తెలీకుండానే జాలిపడ్డాను కూడా. ఫలితం—పెళ్ళి చేసుకొన్నాను.

"ఆవిడకు తల్లీ-దండ్రీ లేరా? వాళ్ళ ప్రమేయమేం లేకుండా పోయిందా—

అన్నయ్య చెబుతున్నదెందుకో నాకు కథలాగా అనిపించింది, వాస్తవం అని పించలేదు.

"ఉన్నారు. వాళ్లు కూతురు చేసిన పనికి తలెత్తుకోలేక వూరొదిలి దూరంగా వెళ్ళిపోయారు. ఉన్నవాడే వాళ్ళ నాన్న. గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేస్తాను. వాడిపే సలు [illegible]కి రానివ్వకు అన్నాడట. ఒప్పుకోలేదు సౌభాగ్యం' అని ఆగాడు.

"తరవాత" అన్నాను.

"ఏముంది, నా దగ్గరకు వచ్చి పెళ్ళి చేసుకుంది. తన నగలన్నీ ముందు కిళ్ళీ కొట్టు పెట్టాను. చుట్టుపక్కలెక్కడా పెద్ద కొట్టు లేకపోవడంతో బాగా లాభం వచ్చింది. అలా....అలా....యిప్పుడింత

వ్యాపారినయ్యాను. ఈ మధ్యలో మాకు మా యిష్టాలతో ప్రమేయం లేకుండానే మరో యిద్దరు పిల్లలు పుట్టారు. ఆవిడ కిష్టంలేనిది చేసి ఆనందించడం అలవాటయి పోయింది. అందగత్తెనన్న అహం ఆ సౌభాగ్యం ప్రతి కదలికలోనూ పెళ్ళయ్యాక కూడా కనిపించేది. ఎంత అందగత్తెవైనా నువ్వు ఆడదానివి. మొగాడికి లోకువన్న విషయం గుర్తుంచుకో అన్నట్లుగా ప్రవర్తించేవాడ్ని నేను. నా ఇష్టం వచ్చినట్లు తిరిగేవాడ్ని. సౌభాగ్యం ఇల్లు కదలకుండా కట్టడి చేశాను."

"ఏమయినా జరిగింది జరిగిపోయింది. కట్టుకొన్న పెళ్ళాన్ని అంతలా హింసించడం నీకు క్షంతవ్యం కాదు" అన్నాను.

"ఆ ఆలోచన సౌభాగ్యానికీ వుండాలిగా మరి. జరిగింది జరిగిపోయిందని, కట్టుకొన్న మొగాడికి నాతో అందరి ఇల్లాళ్ళలా మసలగలుగుతూంటే నా బతుకు ఈనాడు వేరోలా వుండి ఉండేది" అన్నయ్య గొంతుకలో బరువు గమనించాను.

కాని ఆవిడకది ఏకోశానా లేదు. ఇప్పటికీ అంతే! నలుగుర్లో ఉంటేమటుకు నా మొగుడంతటివాడు లేడు. ఒంటరిగా వుంటే ఛీత్కారాలు. అంతేకాదు చెల్లమ్మా— నువ్వు నా బతుకు నాశనం చేశావు. నేను నీ అంతం చూస్తాను అంటుంది.

దాని అంతం అలా చెరలా ఆ ఇంట్లో అయిపోవడం నేను చూడాలి. అదే నా కోర్కె. పిశాచీలాంటి ఆడది."

"ఊరుకో అన్నయ్యా!" అన్నాను.

"అంతేనమ్మా చెల్లాయ్! అందులో అబద్ధమేం లేదు. ముగింపు నీకే వదిలేస్తున్నాను. ఎలా చేసినా సరే. నీ అన్నయ్య కోసం కాస్త శ్రమపడి అది కథమటుకు రాయాలి ' అంటూనే నే పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు. అతడి నెరసిన తల వెంట్రుకలు తమాషాగా గాలికి కదులుతూంటే, అది కనిపించనంతసేపూ చూస్తూనుంచుండి పోయాను.

సౌభాగ్యం చెప్పిన కథ:—

అన్నయ్య చెప్పిన విషయాలు ఆలోచిస్తూనే సాయంత్రంవరకూ గడిపేశాను. ఒకసారి వెళ్ళి సౌభాగ్యాన్ని కలుసుకు రావాలనిపించింది. కాఫీ కాచి ఫ్లాస్కులో పోసి ఎదురుగుంటా టేబిలుమీద పెట్టాను. టిఫిను ప్రమేయం పెట్టుకోలేదు. అయినా ఈ విషయం సౌభాగ్యందగ్గర ఎలా కదపాలో తెలీలేదు. నా కథపడ్డ "మాగజైన్" ఒకటి తీసుకొని, ఇంటికి తాళంవేసి, పక్కింటివాళ్ళకి తాళంచెవిచ్చి బయల్దేరాను.

గుమ్మం కర్టెను తొలగించి లోపల అడుగు పెట్టాను నన్ను చూడగానే సౌభాగ్యం కళ్లు తళుక్కుమన్నాయి. "నువ్వు కథలు రాస్తావా? మీ అన్నయ్య చెప్పారు. ఇన్నాళ్ళూ నాకు చెప్పలేదేం?"



అన్నది సంభ్రమంగా నా రెండు చేతులూ పట్టుకొంటూ.

"అందుకే వచ్చాను. నువ్వే అడిగావు" అన్నాను చేతిలో పత్రిక సౌభాగ్యానికి యిస్తూ.

ఆ పత్రిక నిర్లక్ష్యంగా టేబిల్ మీద పడేస్తూ అన్నది:

"ఈ విషయం తెలిసిన దగ్గర్నుంచి నేను ఆగలేకుండా వున్నాను. నువ్వు నా కథ రాసిపెట్టాలి."

నవ్వు దాచుకొంటూ అన్నాను. "అందరికీ కథలేనా?" అని.

"అందరి కథలాంటిది కాదు నాది. అందరి బతుకులాంటిది కాదు. రాసి తీరాలి నువ్వు. ఈ నిజం నువ్వు లోకం ముందర పెట్టి, ఆడదాని బతుకు ఎంత హీనంగా వుంటుందో లోకానికి చెప్పాలి" అన్నది.

అన్నయ్య చెప్పిన కథ ఒకమూల మనసులో మెదులుతూనే వుంది. "అన్నయ్యని కట్టుకొన్న నీ బతుకు హీనమా? అసంభవం" అన్నాను కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

నా ముందుగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ అంతకంటె పెద్ద గొంతుకతో అన్నది సౌభాగ్యం

"అన్నయ్యని కట్టుకొన్నా కాబట్టే నా బతుకిలా మాడి మసిబొగ్గయిపోయింది. మీ అన్నయ్యలాంటివాళ్ళు వుండకూడదు. కాదు వుండనివ్వకూడదు."

"అన్నయ్యలో చెడు అలవాట్లు వున్నాయి. కాదనను. కాని అన్నయ్యలో మంచితనం వుంది. దాన్నెవరూ కాదనలేరు" అన్నాను గొంతు తగ్గించి, చాలా సౌమ్యంగా.

"ఏవిటీ మంచితనం? ఆడదాని బతుకుతో ఆటలాడుకోవడమా? అయినింటి ఆడపిల్లని నిస్సహాయస్థితిలో కన్నా

మిన్నా కానకుండా బలవంతం చేయడం మంచితనమా? మంగళసూత్రమంటూ మెడకొక వురితాడు బిగించి. అన్నీ వుంచి కావలసిన స్వేచ్ఛలేకుండా చేసి బంది ఖానాలో పెట్టినట్లు వుంచడం మంచి తనమా?'' సౌభాగ్యం ముఖం ఎఱ్ఱగా కందిపోయింది. మెడదగ్గర నరాలు వుబ్బాయి సాలోచనగా చూస్తూ మాట్లాడ కుండా వూరుకొన్నాను.

"ఏంమాట్లాడకుండా వూరుకొన్నావేం. అన్నయ్య — అన్నయ్య మంచితనం గురించి?' తరెగరేసి రెట్టించింది.

''అన్నయ్యమీక అబద్ధం చెప్పాల్సిన అవసరం నీకులేదని నాకు తెలుసు. కాని ఏ పరిస్థితిలో అన్నయ్య అలా చేశాడో నాకు తెలియ'' అన్నాను.

''పరిస్థితి'' హేళనగా నవ్వింది సౌభాగ్యం. ''పరిస్థితి వేరే ఏం కావాలి అందాంతో మొదటి? అందమైన ఆడ దాన్ని చూడగానే మతిపోయింది. మనిషి నన్న జ్ఞానం కూడా పోయింది. దాంతో బాపే తప్పు ఎవరిదైనా ఫలితం స్త్రీమీదే వేస్తుంది ప్రకృతి. అదే జరిగింది. ఫలితం వివాహం'' జరిగింది.

''అమ్మగారూ ఈ పూటకి కూర'' అంటూ చీరకొంగుకి చేతులు తుడుచు కొంటూ వచ్చింది పనిమనిషి.

''చావు. ఏదో ఒకటి చావు. ఏది లేక పోతే కావాలసి మారాం చేసినవాళ్ళకి యింత గడ్డి పెట్టు''. సౌభాగ్యం ఒళ్ళెరగ కుండా అరుస్తూంటే పనిచేసేది బిత్తర పోయి. మెల్లగా అవతలకు వెళ్ళిపోయింది. సౌభాగ్యంకూడా లేచివెళ్ళి తలుపు బోల్టు బిగించి వచ్చింది.

''అంత అయిష్టత వున్నప్పుడు నువ్వీ వివాహప్రసక్తి పెట్టుకోకుండా వుండా ల్సింది. పొరబాటు చేశావ్'' అంటూండ గానే—

''అంటే సంఘం ముందర నన్ను దోషిగా నిలబెట్టమనా నీ వుద్దేశ్యం?'' నా కళ్ళలోకి గుచ్చిచూస్తూ అన్నది.


''అబ్బే అదికాదు నా వుద్దేశ్యం— దానికి యింకేదో మార్గం'' నామాట పూర్తికాలేదు—

''అంటే భ్రూణహత్య చేయమనా నీ వుద్దేశ్యం?'' ధిక్కరిస్తున్నట్లు అన్నది.

''పెద్దపాపని చూశావు కదూ. దాని అందం. తెలివితేటలూ'' అడ్డు తగులుతూ అన్నాను.

'ఆమాట అనడంలేదు సౌభాగ్యం. ఆ ఒక్కబిడ్డ నీకు బరువుకాదు. గుండె రాయిచేసుకొని....''

''పుట్టాక కాదు, పుట్టకముందే బరువు. నాకు కాదు, నా తలిదండ్రులకి. వాళ్ళ పరువు మంట కలసిపోతుందని వాళ్ళ భయం. వాళ్ళు చెప్పిన మార్గం నే నొప్పుకోలేదు. ఎందుకు ఒప్పుకోవాలి? ఆ మగాడ్ని వాడి దోవన ఎందుకు వదిలి పెట్టాలి? నా బతుకు నాశనం చేసినవాడ్ని తన బతుకు నాశనం చేయందే వదలను.




పగ, పగ. అందుకే కాళ్ళా వేళ్ళా పడి పెళ్ళి చేసుకొన్నాను"

"అన్నయ్య చేసుకోననంటే ఏం చేసు దేవానివి?" అప్రయత్నంగా అనేశాను.

"చేసుకోనని ఎలా అంటాడు? అందమైన ఆడది తనకి తానుగా వచ్చి కాళ్ళమీద పడితూ ఉంటే" సౌభాగ్యం గొంతులో హేళన

"సరే చేసుకొని నువ్వేం సుఖపడ్డావ్" అన్నాను కనబరిచకుండా.

"సుఖపడటానికి చేసుకోలేదని మొదటే చెప్పాను. పగ తీర్చుకోవాలని చేసుకొన్నాను" అన్నది కళ్ళలో ప్రతీకారవాంఛ ప్రతిబింబిస్తూ ఉంటే.

"అన్నయ్య తప్పుచేశాడు నిజమే! కాని మీరు ఆలుమగలు అయిన తరువాతైనా పాతపగలు మరచిపోవాల్సింది. అలా అయివుంటె అన్నయ్య నిన్ను నెత్తినపెట్టుకొని చూస్తూండేవాడు ఇంతగా బజారు సరుకును పరుగెత్తేవాడు కాదు" అన్నాను సౌభాగ్యం వంక చూసి.

"నేనిక్కడకు వచ్చింది పగ తీర్చుకోడానికి మాత్రమే. అదిమటుకే చేసుకొంటాను. అంతవరకే నా కర్తవ్యం. ఆ మనిషి ఎంతగా నాశనమయితే నాకంత సంతోషం" అన్నది.

"ఈ ధోరణి మార్చుకోలేవా సౌభాగ్యం? నువ్వు మారితే తప్పకుండా అన్నయ్య కూడా మారుతాడన్న నమ్మకం నాకుంది" బతిమాలుతున్నట్లు సౌభాగ్యం కళ్ళల్లో కళ్ళు కలిపి అడిగాను.

"ఈ మనసెప్పుడో పాషాణమైపోయింది. ఇందుకో మారేందుకేమీలేదు" అన్నది నిర్లక్ష్యంగా ఎటో చూస్తూ. హఠాత్తుగా చూపులు నామీదకు తిప్పి

అన్నది

"నువ్వు యిలా మీ అన్నయ్యతో పూసకుతిరుగుతూంటే లోకం ఏమనుకుంటోందో ఎప్పుడైనా గమనించావా." అని ఎందుకో నాకు ఫక్కుమని నవ్వువచ్చింది. కృష్ణశాస్త్రి గుర్తొచ్చాడు.

"నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు" అన్నాను.

"మాపని చేసేవాళ్ళు అనుకొంటూంటే విన్నాను." మొగాడు చేతకానివాడైనప్పుడు ఆడది ఎలాగన్నా తిరుగుతుందని! ఈసారి అలాంటి మాటలు అంటే చెప్పు తీసుకు తంతా. నోరు మూసుకోమన్నాను. నలుగురూ అంటూంటె అన్నాము. ఉత్తినే మా కెందుకొచ్చిన గొడవ— అన్నారు" అన్నది.

"లోకం వున్నదెప్పుడూ చూడలేదు. పోనివ్! నమ్మవలసినవాళ్ళు నన్ను నమ్మారు. చాలు" అన్నాను తృప్తిగా. సౌభాగ్యం మెదలకుండా వింటూ కూర్చుంది. కాసేపాగి హఠాత్తుగా నా రెండు చేతులూ పట్టుకొని "ఏమైనా సరే నువ్వు నా కథ రాయాలి. తప్పదు" అన్నది.

"ఏమని రాయమంటావు?" అని అడిగాను.

"చెప్పాగా. ఆ మనిషిమీద పగతీర్చుకోడానికే యింకా ఈ ఇంట్లో వున్నాను. ఈ ఇంట్లోంచి బయటపడాలనుకొంటె ఏదో ఒక సమయంలో పడలేకపోను. బైటపడి నేను చేసేదేమిలేదు. ఈ ఇంట్లో వుండే సాధిస్తాను. ఇది నువ్వెలా రాసినా సరే. ఎలా మొదలుపెట్టినా. ఎలా ముగించినా సరే" సౌభాగ్యంలో మళ్ళీ వుద్రేకం పెరుగుతోంది.

"అలాగే" అన్నట్లు తల పంకిస్తూ. "సాటిస్ఫ్రీగా నైనా నువ్వు కోరింది చెయ్యటానికి ప్రయత్నిస్తాను" అంటూ నే తలుపు తీసుకు బయటపడ్డాను సౌభాగ్యానికి యిక మాట్లాడేటందుకు అవకాశం యివ్వకుండా. అప్పుడే ఆటలు ముగించి వస్తున్న పిల్లలు వెంటపడ్డారు. కాని వాళ్ళను పట్టించుకోకుండా వీధిలోకి వచ్చి నడక సాగించాను. నా బుర్ర నిండా ఒకటే సమస్య. దీనికి ముగింపు ఏమని చెయ్యను?

అన్నయ్య. సౌభాగ్యం. నేను ఎక్కడెక్కడో పుట్టాము. ఒకచోట కలుసుకొన్నాము. వాళ్ళ యిద్దరికీ మనసులో మనసునై అల్లుకుపోయాను. ఇప్పుడు వాళ్ళ కథకు నేనెలాంటి ముగింపు యివ్వాలి?

